సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 28 । నవంబర్ । 2024



ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం

క్రీడలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయి. ఆత్మస్థైర్యం పెంపొందేందుకు దోహదం చేస్తాయని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. -8లో



పొంచి ఉన్న ప్రమాదం

ఇసుక అక్రమ రవాణాదారులు బరితెగించి బ్రిడ్జిల కిందనే ఇసుకను తోడేస్తున్నారు. ఫలితంగా హైలెవల్ బ్రిడ్జిలు ప్రమాదకరంగా మారుతున్నాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.460	రూ.540
రెండోరకం	రూ.300	రూ.454



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 192 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	487	552
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 93.890 కిలోలు

న్యూస్‌రీల్

1న హ్యాండ్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో డిసెంబర్ 1వ తేదీ ఉదయం జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషుల విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె. చిన్నపరెడ్డి, ఎ. సింధూరి తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు డిసెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే వారు 3 పాస్‌పోర్టు సైజుఫొటోలు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

19 నుంచి శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 19 నుంచి ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్‌లో నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు కలిగి ఆసక్తిగల యువకులకు శిక్షణ ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

సచివాలయం తనిఖీ



మాధవరం-1 సచివాలయంలో స్వర్ణ పంచాయతీల సర్వేలను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 గ్రామ సచివాలయాన్ని బుధవారం డీపీఓ రాజ్యలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పంచాయతీలో జరుగుతున్న స్వర్ణ పంచాయతీల సర్వేలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల ప్రకారం జిల్లాలో స్వర్ణ పంచాయతీలో చేపట్టిన సర్వే రిపోర్టులు పక్కాగా తయారు చేయాలన్నారు. కార్యదర్శులు ఇంటి పన్ను, నాన్ ట్యాక్స్‌లను పరిశీలించి 30 తేదీ లోపల అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మహతాబ్‌యాస్మిన్, కార్యదర్శి లక్ష్మినరసయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

నందలూరు: మండల కేంద్రంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధ వారం అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కె సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో జరుగుతున్న బోధన అభ్యసన ప్రక్రియలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులకు సంబంధించిన అకడమిక్ మానిటరింగ్ అంశాలను పరీక్షించారు. అన్నమయ్య జిల్లా జీసీడీఓ ఎస్ శశికళ, డీఈఓ కార్యాలయ క్యాంప్ క్లర్క్ ఎస్ హబీబ్, పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ ఎస్ రౌఫ్ బాష, పాఠశాల ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘాలు బలోపేతం కావాలి



ఎఫ్‌పీఓ కేంద్రం తనిఖీలో ఉద్యాన శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్

పెద్దతిప్పసముద్రం: రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాలోన్లి సభ్యులు సంఘాల బలోపేతానికి కృషి చేయాలని ఉద్యాన శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ డీ.అండాల్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని మద్దయ్యగారిపల్లి సమీపంలోని ఎఫ్‌పీవో కేంద్రాన్ని సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. సదరు కేంద్రం పరిధిలో ఎంత మంది రైతులు సభ్యులుగా ఉన్నారు, రైతులకు అందజేస్తున్న వ్యవసాయ యాంత్రిక పరికరాలు, ఎరువులు, పురుగుల మందులు, రైతుల రుణాలకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. అన్నమయ్య జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, హెచ్‌వో భీమేష్, ఏపీ మాస్ వాసుదేవ్‌రెడ్డి, వీహెచ్‌ఏ మహబూబ్‌బాషాతో పాటు ఎఫ్‌పీవో నిర్వాహకులు ఉన్నారు.

సిరుల చామంతి!



సెంటు ఎల్లో చామంతులు....
అదేనండీ మన నాటి చామంతులు
పిల్లగాలులకు ఏంచక్కా
తలలూపుతూ మురిపించడమే
కాదు.. పంట సాగు చేసిన రైతన్న
ఇంట లాభాలు కురిపిస్తున్నాయి.
విభిన్నంగా ఉంటూ ఆకర్షించడమే
కాదు.. రైతన్న ముంగిట
సిరులొలికిస్తున్నాయి.
అనతికాలంలోనే వారిని
శ్రీమంతులుగా మారుస్తున్నాయి.

- నిలకడైన ఆదాయంతో రైతుకు లాభాలు
- పండుగ సీజన్లలో భలే గిరాకీ

గుర్రంకొండ: సెంట్‌ఎల్లో చామంతి (నాటి చామంతి) సిరులు కురిపిస్తోంది. ఈ రకం పూల సాగుతో నిలకడైన ఆదాయం వస్తుండడంతో రైతులు వీటి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ కొత్తరకం చామంతులు సాగు చేసిన రైతులు లాభాలు కళ్లజూస్తున్నారు.

కర్ణాటక నుంచి దిగుమతి: ప్రస్తుతం ఈ రకం పూల నారు మన రాష్ట్రంలోని నర్సరీల్లో లభించడం లేదు. దీంతో జిల్లా రైతులు కర్ణాటక రాష్ట్రం నుంచి నారుమొక్కలను దిగుమతి చేసుకొంటున్నారు. సాధారణంగా ఇక్కడి నర్సరీల్లో రూ. 1 నుంచి రూ. 2 వరకు మొక్కల ధరలు ఉంటాయి. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉండడంతో రైతులు బయట రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొంటుండడం విశేషం.

బరువు ఎక్కువ ...

సాధారణ చామంతి పూలతో పోల్చితే ఈ రకం పూలు బరువు ఎక్కువ. సాధారణ చామంతి పూల రేకుల్లా కాకుండా సెంట్ ఎల్లో చామంతి రేకుల బరువు వైవిధ్యంగా ఉంటుంది. తొందరగా రేకులు రాలిపోవు, రబ్బరు లాగా పువ్వుకే అతుక్కొని ఉంటాయి. పైగా ఇవి సాధారణ చామంతి పూల కంటే ఎక్కువ రోజులు వాడిపోకుండా సువాసన ఇవ్వగలిగిన స్వభావం ఉంది. అందుకనే మార్కెట్లో ఈరకం పూలకు ప్రత్యేకత ఉంది. ప్రస్తుతం పసుపురంగు ఉన్న పూలతోపాటు ఇప్పుడిప్పుడే తెలుపు రంగు రకం పూల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తుండడం విశేషం.



గుర్రంకొండ మండలం చెరువుమొరవపల్లెలో రైతులు సాగు చేసిన సెంట్ ఎల్లో రకం పూల తోటలు

ఎకరానికి 5 టన్నుల దిగుబడి

సెంట్‌ఎల్లో పూల సాగులో 4 నుంచి 5టన్నుల పూల దిగుబడి వస్తుంది. ఇంకా మంచి ఎరువులు వేసి సకాలంలో తోటలను కాపాడుకొంటే మరో టన్ను వరకు అధికదిగుబడి రావచ్చు. సాధారణంగా 120 నుంచి 150 రోజుల నుంచి పూల దిగుబడి ప్రారంభమైన మరో 90 రోజుల పాటు పూల కోతలు వస్తుంటాయి. ఈలెక్కన పంట కాలం 7నెలల పాటు ఉంటుంది.

ఎకరానికి రూ.లక్ష ఖర్చు

సెంట్‌ఎల్లో పూలసాగు దుక్కుల దగ్గర నుంచి పూలు చేతికొచ్చేంత వరకు రూ. లక్ష వరకు ఖర్చు వస్తుంది. ఎకరానికి 8వేలు నుంచి 10 వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఒక నారు మొక్క మార్కెట్లో రూ.3 వరకు ధర పలుకుతోంది. ఈలెక్కన ఎకరానికి రూ. 30 వేలు నారు మొక్కలకు ఖర్చు వస్తుంది. ఎరువులు, పురుగుల మందుల పిచికారి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టమాటా తోటలు మాదిరిగా ఈమొక్కలకు సీడ్ కట్టెలు నాటే ప్రక్రియను రైతులు చేపట్టారు. మొక్కలు నాటిని 120 నుంచి 150 రోజుల మధ్యలో పూల దిగుబడి మొదలవుతుంది.

మార్కెట్లో కిలో రూ.130

ప్రస్తుతం ఈ రకం పూలు మార్కెట్లో కిలో రూ. 130 వరకు ధరలు పలుకుతున్నాయి. గత ఇరవైరోజులుగా ఇవే ధరలు మార్కెట్లో నిలకడగా ఉండడంతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. ఈ లెక్కన ఎకరానికి రూ. 3.20 లక్షల నుంచి రూ. 4 లక్షల ఆదాయం వస్తోంది. పంటసాగు ఖర్చు, కోత కూలీలు, రవాణా ఖర్చులు పోను ఎకరానికి రూ. 2.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు లాభాలు చవిచూసే అవకాశముంది. మార్కెట్లో ధరల నిలకడను బట్టి ఆదాయ, లాభాలు మారవచ్చు. పండుగ సీజన్‌లో ధరలు పెరుగుతాయి. మొన్న దసరా దీపావళీ పండుగ సీజన్‌లొ మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటకా రాష్ట్రాల్లో కిలో రూ.150 నుంచి రూ.250 వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం పడమటి ప్రాంతాల రైతులు ఈ రకం పూల సాగు ఎక్కువగా చేపట్టారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో పాటు రానున్న జనవరిలో సంక్రాంతి పండుగల సీజన్‌లొ మంచి ధరలు పలికే అవకాశముంది.

ఎకరంలో సాగు చేశా



సెంట్‌ఎల్లో రకం పూలను ఎకరం పొలంలో సాగు చేశాను. నారు మొక్కలు నాటి నుంచి పూల కోతలు మొదలయ్యే వరకు ఎకరానికి రూ. లక్ష వరకు ఖర్చు వచ్చింది. సాధారణ చామంతిపూలతో పోల్చితే ఈ రకం పూలలో నాణ్యత ఎక్కువగా ఉంటుంది. ఈ రకం పూలు మంచి సువాసన కలిగి ఉంటాయి. మార్కెట్లో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది.

– పద్మావతి రైతు, మొరంకిందపల్లె

నిలకడైన ఆదాయం




ఈరకం పూలసాగులో రైతుకు నిలకడైన ఆదాయం వస్తుంది. మార్కెట్లో పూల ధరలు కొద్దిరోజుపాల పాటు నిలకడగా ఉంటే నష్టాలు రావు. పూలు కుడా మార్కెట్‌కు తీసుకెళ్లేంత వరకు దెబ్బతినకుండా ఉంటాయి. సాధారణ చామంతితో పోల్చితే ఈ రకం పూలుతొందరగా పాడవవు. ఎకరానికి ఎంతలేదన్నా 4 లక్షల రూపాయల ఆదాయం వస్తుంది.

–రెడ్డిమోహన్, పూల రైతు, చెరువుమొరవపల్లె

విండ్ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

రామాపురం: రామాపురం–వీరబల్లి మండలాల సరిహద్దులోని వంగిమళ్ల సమీపంలో ఏర్పాటు చేయనున్న విండ్ ప్రాజెక్టు (గాలి మరల విద్యుత్ ప్లాంట్) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. వీరబల్లి మండలం వంగిమళ్ల సమీపంలో 1800 మెగావాట్ల సామర్థ్యంతో ఈ గాలి మరల విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గత ప్రభుత్వంలో 490 ఎకరాల భూమిని సేకరించారు. అదనంగా 190 ఎకరాలు భూమి అవసరమంటూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విండ్‌పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసే భూమి వరకు నాలుగు లైన్ల రోడ్డు వేసేందుకు కడప – రాయచోటి ప్రధాన రహదారి గువ్వలచెరువు నుంచి వంగిమళ్ల వరకు కొండ కింది భాగంలో రోడ్డు వేసేందుకు సర్వే కూడా పూర్తయింది. ఇందుకు అవసరమైన భూమి సేకరణ కూడా పూర్తి చేసినట్లు తెలిసింది. 1800 మెగావాట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం 676 ఎకరాలు కావాల్సి ఉంటుందని, ఆ సంస్థ ఎండీ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి ఇతర సదుపాయాలు అన్ని సమకూర్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.



బాల్య వివాహాలను అరికట్టడం మన బాధ్యత

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

కేవీపల్లె: బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను రూపొందించడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. బాల్య వివాహ ముక్త్ భారత్ దినోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం కేవీపల్లె ఎంపీడీవో కార్యాలయంలో 'బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్' కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరమని తెలిపారు. బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి బాల్య వివాహాలు ఆటంకం కల్గిస్తాయన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పల్లెపండుగ సీసీ రోడ్ల నాణ్యతలో రాజీ వద్దు

పల్లె పండుక కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్ల నాణ్యతలో రాజీ పడకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం మండలంలోని సొరకాయలపేట పంచాయతీ వంకవడ్డిపల్లెలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. రోడ్డు నాణ్యత, పొడవు, వెడల్పు, అంచనా ఖర్చు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే కేవీపల్లె ఏపీ మోడల్‌స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డ్వామా, హౌసింగ్, డీఆర్‌డీఏ పీడీలు వెంకటరత్నం, శివయ్య, సత్యనారాయణ, తహశీల్దార్ క్రాంతికుమార్, ఎంపీడీవో సుధాకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

బాల్య వివాహం సాంఘిక దురాచారం

రాయచోటి (జగదాంబసెంటర్): బాల్య వివాహం సాంఘిక దురాచారం అని అన్నమయ్య జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.రమాదేవి, డీసీపీఓ వినోద్‌కుమార్ తెలిపారు. రాయచోటి పట్టణం మాసాపేటలో గల సుగవాసి రాజారాం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల్ వివాహ ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాల్య వివాహ నిషేధ చట్టంపైన అవగాహన, బాలికలపై లైంగిక వేధింపులు, చైల్డ్ ట్రాఫికింగ్, ఫోక్సో చట్టంలోని అంశాలను విద్యార్థినులకు వివరించారు. డీఎంహెచ్ఓ డా.కొండయ్య, ఏఎస్ఐ బాదుల్లా, ప్రధానోపాధ్యాయులు శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ఓబులవారిపల్లె: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ పేర్కొన్నారు. బుధవారం చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'బాల్యవివాహాల నిషేధ చట్టం'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం... అవగాహన లేమితో బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని,వాటిని అరికట్టేందుకు అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఐసీడీసీ సూపర్ వైజర్ అనుసూయమ్మ, గణపతి, ఎంఈఓ రెడ్డయ్య, ప్రిన్సిపాల్ మల్లికార్జున రాజు తదితరులు పాల్గొన్నారు.



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ ఓబులమ్మ

నూతన నియామకం

కడప రూరల్: రాష్ట్ర మాలమహానాడు రామాజీ ఇమ్మానియేల్ వర్గం రాయలసీమ మహిళా అధ్యక్షురాలిగా బండి సీతును నూతనంగా నియమించారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపాక వినోద్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో తమ వర్గం గ్రామ, మండల, జిల్లా స్థాయిలో మరింత చురుగ్గా పనిచేసేందుకు నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినయ్ సాగర్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఉల్లి కిరణ్, రాయలసీమ అధ్యక్షుడు మేకల ఓబులేసు, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షుడు సీకే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రామసముద్రం మండలం మూగవాడికి చెందిన జయరాం(40) భవన నిర్మాణ పనుల కోసం మదనపల్లె చంద్రాకాలనీకి వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసి వచ్చేందుకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా, వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదేవిధంగా నక్కలదిన్నెకు చెందిన రమేష్(32) వ్యక్తిగత పనులపై వేంపల్లెకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా, చిప్పిలి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తులకు గాయాలు

రాయచోటి : రాయచోటి- చిత్తూరు మార్గంలోని సంబేపల్లి మండలం ఎర్రగుంట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 మంది అయ్యప్ప భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం నుంచి 50 మంది అయ్యప్ప స్వాములు స్వామి దర్శనానికి వెళ్తున్న సమయంలో బుధవారం తెల్లవారుజామున ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదం లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే సంభవించినట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. స్వల్పంగా గాయపడిన 20 మందికి రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించామన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ అవినీతిపై సబ్ కలెక్టర్ విచారణ

మదనపల్లె : మండల తహసీల్దార్ ఖాజాబీ అవినీతిపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఫిర్యాదు మేరకు, కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాలతో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విచారణ నిర్వహించారు. బుధవారం సబ్ కలెక్టరేట్‌లో మండల వీఆర్వోలను పిలిపించి, ఒక్కొక్కరిని పంచాయతీల వారీగా వారి పరిధిలో జరిగిన మ్యుటేషన్లు, ఆన్‌లైన్, పాసు పుస్తకాల జారీ, ఫ్రీహోల్డ్ భూముల వెరిఫికేషన్, ఎన్‌ఓసీలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖాజాబీ తహసీల్దార్‌గా వచ్చిన తర్వాత కార్యాలయంలో జరిగిన లావాదేవీలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీపై వచ్చిన ఫిర్యాదులన్నింటిపై విచారించారు. విచారణలోని అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

14 మంది జూదరుల అరెస్టు

గుర్రంకొండ : మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో 14 మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం గ్రామానికి సమీపంలోని హంద్రీ నీవా కాలువ పరిసరాల్లో జోరుగా జూదం నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 42,850 తోపాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.అభి జాతీయ స్థాయి అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయన్న, ఫిజికల్ డైరెక్టర్ రవీంద్రరాజు తెలిపారు. అలాగే అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగిన అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్లస్-టు జూనియర్ కళాశాల విద్యార్థి కె.ఆంజనేయులు (ఎంపీసీ) జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆత్మస్థైర్యానికి క్రీడలు దోహదం



రాయచోటి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి పోలీస్ ఆటల పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల ఆటల పోటీల ప్రారంభోత్సవంలో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న పోలీసులు

జిల్లా వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు -2024 ప్రారంభోత్సవంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : 'క్రీడలు ఓటమిని, కష్టాన్ని భరించే శక్తిని ఇస్తాయి. ఆత్మస్థైర్యం పెంపొందేందుకు దోహదం చేస్తాయి. అలాంటి ఆటల ద్వారానే పోలీసులు టీమ్ వర్క్ నేర్చుకుంటారు'.. అని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలు -2024ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. స్టేట్‌మీట్‌లో డెకాత్ లెన్ 10 ఈవెంట్లలో వరుసగా మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించిన హెడ్ కానిస్టేబుల్ 672 ఎం.చెన్నయ్య, రాష్ట్ర అథ్లెటిక్స్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన మహిళా కానిస్టేబుల్ 1836 పి.శశికళలు అందించిన క్రీడా జ్యోతిని ఎస్పీ వెలిగించారు. పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పోలీస్ స్పోర్ట్స్ మీట్ ఎంతో దోహదపడుతుందని ఎస్పీ అన్నారు. 24 గంటలు విధి నిర్వహణలో ఉండే పోలీస్ సిబ్బందికి ఈ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో ఉన్న క్రీడా ప్రతిభను గుర్తింపును తెస్తాయన్నారు. జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర పోలీస్ మీట్‌కు పంపిస్తామన్నారు. ఆటల పోటీలలో పిల్లలను భాగస్వాములను చేయడం వలన మానసికంగా, శారీరకంగా దృఢంగా అవుతారన్నారు. ఈ నెల 27, 28, 29వ తేదీలలో జరిగే స్పోర్ట్స్ మీట్‌లో 4 జోన్లకు సంబంధించిన 4 టీమ్‌లు పాల్గొంటారన్నారు. ఇందులో రాయచోటి, మదనపల్లి, రాజంపేట, ఏఆర్ హెడ్ క్వార్టర్స్ టీమ్‌లు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్, లాంగ్ జంప్, క్రికెట్, టెన్నిస్, షటిల్ మొదలగు క్రీడలలో పాల్గొంటారని తెలిపారు. పోలీసు క్రీడాకారులు గేమ్ స్పిరిట్‌తో ఆటల పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్), ఎం.వెంకటాద్రి, రాయచోటి, మదనపల్లి, రాజంపేట డీఎస్పీలు ఎంఆర్ కృష్ణమోహన్, డి.కొండయ్యనాయుడు, ఎన్.సుధాకర్, ఏఆర్ డీఎస్పీ, బి.చిన్నికృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది, పీఈటీ మాస్టర్లు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

రూ.8.68 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్ : సత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురం నగరంలోని అనంతసాగర్ కాలనీకి చెందిన షికారి కోటయ్య, షికారి శ్యాలీ అలియాస్ శ్యామ్, షికారి శీన అలియాస్ అర్జున్ ఉన్నారు. వ్యసనాలకు బానిసలైన వీరు తమ అవసరాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు తెగబడ్డారు. పుట్టపర్తి రూరల్, గోరంట్ల, సోమందేపల్లి, కదిరి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన పలు చోరీ కేసుల దర్యాప్తులో భాగంగా బుధవారం పుట్టపర్తి సమీపంలోని కర్ణాటకనాగేపల్లి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేయడంతో తాము చేసిన దొంగతనాలను వారు అంగీకరించారు. వీరి నుంచి రూ 7.68 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, రూ. లక్ష నగదు, ఓ ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, జిల్లాతో పాటు అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలలో పలు చోట్ల దొంగతనాలు చేసి పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లుగా పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఆస్పత్రి ఆవరణలో వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు నరసింహులు

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి ఆవరణలో వృద్ధుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. మండలంలోని చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన నరసింహులు(68) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసేవాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో పనులకు వెళ్లలేక ఇంటిపట్టునే ఉండేవాడు. ఈనెల 23, 25 తేదీల్లో జిల్లా ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాడు. మరోసారి బుధవారం ఉదయం చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ఓపీలో వివరాలు నమోదు చేసుకుని, ఆస్పత్రి ఆవరణలోని చింతచెట్టు కింద ఉండగా, అకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది విషయాన్ని ఆర్ఎంఓ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలతో అత్యవసర విభాగ వైద్యురాలు డాక్టర్ లక్ష్మీకళ వృద్ధుడిని పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో ఉంచి, అతడి వద్ద ఉన్న వివరాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కడప అర్బన్ : కడప నగరం శంకరాపురం పరిధిలోని మద్రాస్‌రోడ్డులో మామిళ్లపల్లి నాగప్రశాంతి హాస్పిటల్‌లో గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఫార్మసీలో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారాన్ని అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని అగ్నిప్రమాదాన్ని నివారించారు. సంఘటన సమయంలో హాస్పిటల్‌లో పేషెంట్లు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల మేరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి బసివిరెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని కడప చిన్నచౌక్ ఎస్ఐ ఎన్.రాజరాజేశ్వర్ రెడ్డి, సిబ్బంది పరిశీలించారు.

రాఘవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ 29కి వాయిదా

కడప అర్బన్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డి తనపై మోపిన అభియోగాలకు సంబంధించిన కేసుపై ముందస్తు బెయిల్ పిటిషన్ కడపలోని జిల్లా కోర్టులో దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరగాల్సి ఉంది. మెజిస్ట్రేట్ ఈ విచారణను 29కి వాయిదా వేశారు. అదే రోజున ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న వర్రా రవీంద్రారెడ్డిని పోలీస్ కస్టడీకి కోరిన పిటిషన్ విచారణ కూడా జరగనుంది.

ఫలితాల్లో ఎందుకు బెస్ట్ ఉండటం లేదు?

విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్

అనంతపురం ఎడ్యుకేషన్ : 'రేకుల షెడ్లలో నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లకు వేలాది రూపాయల ఫీజులు కట్టి పిల్లలను పంపుతున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారు. బెస్ట్ టీచర్లు, బెస్ట్ స్టూడెంట్స్, బెస్ట్ సౌకర్యాలు ఉన్నాయి. మరి ఫలితాల్లో బెస్ట్ ఎందుకు ఉండడం లేదు' అని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన అనంతపురం రూరల్ పరిధిలోని సీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపిక చేసిన ఎంఈఓలు, హెచ్ఎంలకు జరుగుతున్న 'లీడర్‌షిప్' శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకత్వ లోపాలతోనే పాఠశాలల్లో ఆశించిన ఫలితాలు రాలేదన్నది వివిధ సర్వేల్లో తేలిందన్నారు. దీంతో శిక్షణ అనేది దేశ వ్యాప్తంగా తప్పనిసరి చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలంటే తల్లిదండ్రుల్లో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందించాల్సి ఉందన్నారు. లేదంటే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో ప్రస్తుతం దాదాపు 45 యాప్‌లు ఉన్నాయని, అన్నీ కలిపి ఒక ట్రెండ్ యాప్‌లు చేసేలా చూస్తున్నామని చెప్పారు. ఈ రెండు యాప్‌లలోనే అన్ని అంశాలూ ఉంటాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థుల అకడమిక్ ప్రోగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ అయినా ఉపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజు, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఓ నాగరాజు, సీఎంఓ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సీఐ జీవన్ గంగానాథ్

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథ రెడ్డి అనే ఉపాధ్యాయుడి నివాసంలో జులై 17న జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ జీవన్ గంగనాథ్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు సొంత పని నిమిత్తం కడపకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న 105 గ్రాముల బంగారు, 116 గ్రాముల వెండి వస్తువులను దొంగిలించారన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ, డీఎస్పీ మురళి నాయక్ ఆదేశాల మేరకు రెండు బృందాలుగా విడిపోయి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. అందులో భాగంగా పట్టణంలోని ముద్దనూరు రింగ్ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న లింగుటేరీ రాంబాబు, నడింపల్లి గోపి, సోను కుమార్ రాయ్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 105 గ్రాముల బంగారు, 116 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు వేణుగోపాల్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారుల భద్రతకు పటిష్ట చర్యలు

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



రోడ్డు భద్రత అంశంపై పోలీసు, రవాణా ఇతర శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

రాయచోటి : ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రత సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న రోజుల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సరిదిద్దడానికి కార్యాచరణ ప్రణాళికను అమలు పరచాలని నిర్ణయించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనాభాతోపాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, పోలీసు, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. బారికేడ్స్, స్టాపర్స్, ప్రమాదకర సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలన్నారు. సమావేశ ప్రారంభంలో జిల్లా రవాణా అధికారి ప్రసాద్ రోడ్డు భద్రత అజెండా అంశాలలో తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎంవీఐలు, పోలీస్ శాఖ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, వైద్య, ఆరోగ్య, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా

డిసెంబర్ 15న బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

మదనపల్లె : వక్ఫ్ సవరణ బిల్లును తిరస్కరిస్తూ ముస్లిం సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వక్ఫ్ సవరణ బిల్లు తిరస్కరణకు మద్దతు కోరుతూ డిసెంబర్ 15న కడపలో జమాతే-ఉలేమా-ఇ-హింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ తమ సంఘీభావం తెలపాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని నక్కలదిన్నె ఈద్గాలో మంగళవారం రాత్రి రాయచోటి ముఫ్తీ మసూమ్ అధ్యక్షతన కడప సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ముస్లిం పెద్దలు, ఉలేమాలు, ముతవలీల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ఇస్లామిక్ చట్టం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తోందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు దారుణమని..రాజ్యాంగ స్ఫూర్తిపై దాడిగా పేర్కొంటూ, బిల్లు వివక్షతో కూడుకోవడమే కాకుండా ఏకపక్షంగా ఉందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని విభజిస్తోందని, ముస్లింలకు కేంద్రం శత్రువు అని చెప్పేందుకు ఈ బిల్లే సాక్ష్యమన్నారు. ఇది మతపరమైన విభజనను సృష్టిస్తుందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ డిసెంబర్ 15న జమాతే-ఉలేమా-ఇ-హింద్ ఆధ్వర్యంలో కడపలో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకవైపు దేశ వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకుంటున్న తరుణంలో కొందరు దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నేతలు సురేంద్రకుమార్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేశాడు



మాట్లాడుతున్న బాధితురాలు షేక్ ఉమ్మి సల్మా

కడప రూరల్ : పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఓ బిడ్డకు తల్లిని చేసి ఇప్పుడు వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేస్తోంది. బుధవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో షేక్ ఉమ్మి సల్మా అనే బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. కడప నగరం రవీంద్రనగర్‌కు చెందిన తాను భర్తనుంచి విడాకులు తీసుకుని జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లేందుకు కడప నగరం కృష్ణా సర్కిల్‌లోగల జేకే ట్రావెల్స్‌లో సంప్రదించానని తెలిపారు. అయితే ఆ ట్రావెల్స్ ఏజెంట్ తనకు మాయమాటలు చెప్పి విదేశాల్లో పరిస్థితులు బాగా లేవని, తన వద్దనే పనిచేస్తే నెలకు రూ.20 వేలు ఇస్తానని నమ్మబలికాడన్నారు. తనను విదేశాలకు వెళ్లే వారిని చెన్నైకి తీసుకెళ్లి ఫ్లైట్ ఎక్కించడం తదితర పనులను అప్పగించారన్నారు. ఈ క్రమంలో అతను తనను వివాహం చేసుకుంటానని నమ్మబలికి శారీరక సంబంధం కొనసాగించాడన్నారు. తాను గర్భం దాల్చగా వివాహానికి కుంటిసాకులు చెబుతూ తప్పించుకునేవాడన్నారు. అనంతరం తనకు గతంలోనే వివాహమైందని, రూ.5 లక్షలు తీసుకుని వెళ్లిపోవాలని సూచించాడన్నారు. ఎట్టకేలకు తనను వివాహం చేసుకున్నప్పటికీ తీవ్రంగా కొట్టడం, హింసించడం చేసేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్ల పుట్టిందనే సాకుతో వేధింపులు మరింత అధికమయ్యాయన్నారు. తనకు, తన బిడ్డకు న్యాయం చేసి ఆదుకోవాలని ఆమె కోరారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



అద్దవారిపల్లి, గుండ్లూరు సమీపంలో ఫిల్లర్ల కిందే ఇసుక తోడేసిన దృశ్యం



మేడికుర్తి హైలెవల్ బ్రిడ్జి వద్ద ఇసుక తోడేస్తున్న ట్రాక్టర్లు

- ప్రమాదపుటంచుల్లో హైలెవల్ బ్రిడ్జిలు
- బ్రిడ్జిల కిందనే యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్న అక్రమార్కులు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కలికిరి : బాహుదా నదిపై మండల పరిధిలోని మేడికుర్తి, గుండ్లూరు, అద్దవారిపల్లి వద్ద రెండు హైలెవల్ బ్రిడ్జిలున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణాదారులు బరితెగించి బ్రిడ్జిల కిందనే ఇసుకను తోడేస్తూ.. తమకు అడ్డూ అదుపు లేదని వ్యవహరిస్తున్నారు. గుండ్లూరు, అద్దవారిపల్లి బ్రిడ్జి వద్ద ఇసుక తోడేస్తుండటంతో గ్రామస్తులు కొంతమంది కలికిరి తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. అయినా రెవెన్యూ అధికారులు స్పందించక పోవడంతో అక్కడ బ్రిడ్జి కిందనే యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. దీంతో ప్రస్తుతం మేడికుర్తి హైలెవల్ బ్రిడ్జి కింద కూడా ఇసుక అక్రమ తరలింపునకు పూనుకున్నారు. సుమారు 30 నుంచి 50 ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండటంతో ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. దీంతో బాహుదానది ప్రవహిస్తే చుట్టు పక్కల భూములు కోతకు గురవ్వడంతో పాటు హైలెవల్ బ్రిడ్జిలకు ప్రమాదం పొంచి ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుండ్లూరు, అద్దవారిపల్లి హైలెవల్ బ్రిడ్జితో పాటు మేడికుర్తి సమీపంలోని హైలెవల్ బ్రిడ్జి వద్ద భారీగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పీలేరు డివిజన్ ఆర్అండ్‌బీ ఇన్‌చార్జి డీఈ సూర్యనారాయణ రెడ్డి మంగళవారం కలికిరికి చేరుకుని పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, తహసీల్దార్ మహేశ్వరీ బాయికి ఫిర్యాదు చేశారు.

అధికారుల రాకతో పరార్..

బ్రిడ్జి కింద ఇసుక తోడేస్తున్న అక్రమదారులకు అధికారులు వస్తున్నట్లు ముందుగా ఉప్పందడంతో ట్రాక్టర్లతో పరారయ్యారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే సమయానికి అక్కడ ట్రాక్టర్లు లేకపోవడంతో వెనుతిరిగారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉన్నతాధికారులు స్పందించాలి

మండలంలోని బాహుదానది నుంచి ఇసుక నిత్యం అక్రమంగా తరలుతోందని, నిబంధనలు గాలికి వదిలి లోతుగా ఇసుక తవ్వడం, చుట్టు పక్కల పొలాల రైతులు గగ్గోలు పెట్టినా పట్టించుకోకుండా ఇసుక తరలిస్తుండటం పరిపాటిగా మారింది. జిల్లా కలెక్టర్‌తో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకొనకపోవడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– నరసింహారెడ్డి, కొమ్మేపల్లి, కలికిరి మండలం.

వరికోత యంత్రం తగిలి మహిళకు గాయాలు



గాయపడిన రెడ్డెమ్మ

నిమ్మనపల్లె : వరికోత యంత్రం వద్ద పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన శంకరప్ప భార్య రెడ్డెమ్మ(35) వరి పంట నూర్పిడి సందర్భంగా వరికోత యంత్రాన్ని రప్పించారు. పంట నూర్పిడి చేస్తుండగా, వరి పంటను సంచుల్లోకి వేసే క్రమంలో రెడ్డెమ్మకు ప్రమాదవశాత్తు యంత్రం తగలడంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

మదనపల్లె మండలం భూమకవారిపల్లెకు చెందిన రాజన్న భార్య అమ్ములు(35) మంగళవారం నిమ్మనపల్లెలోని బంధువులకు చెందిన పొలంలో వ్యవసాయ పనుల కోసం వెళ్లింది. తిరిగి సాయంత్రం స్వగ్రామానికి వచ్చేందుకు నిమ్మనపల్లె బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తుండగా, ఎదురుగా వచ్చిన కారు ఢీకొని తీవ్రంగా గాయపడింది. ప్రమాదంలో కాలు విరగగా, బాధితురాలిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.